క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే సామేల్



హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునరుజ్జీవం, ప్రక్షాళనకు మద్దతు తెలుపుతూ తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమానికి తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలు భారీగా తరలివచ్చి మద్దతు తెలిపారని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్‌ను సీఎం అభినందించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సత్యనారాయణరెడ్డి



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఎం.సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంపీడీఓ తుమ్మల పవన్‌కుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మద్దిరాల మండల ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డికి ఈ మండల అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

మోటార్ల వైర్లు చోరీ

పెన్‌పహాడ్ : దోసపహాడ్, అన్నారం గ్రామాల్లోని సాగర్ ఎడమ కాలువపై రైతుల వ్యవసాయ మోటార్ల వైర్లను దుండగులు మంగళవారం చోరీ చేశారు. గ్రామాలకు చెందిన తండు దుర్గయ్య, జిన్న చంద్రారెడ్డి, ఋషికుమార్, దామోదర్‌రెడ్డితోపాటు మరికొంత మంది రైతుల వ్యవసాయ మోటార్ల వైర్లు చోరీకి గురయ్యాయి. దుండగులను పట్టుకొని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆలయం వద్ద విక్రయాలకు వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద తలనీలాలు, కొబ్బరికాయల వ్యాపారాలకు సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం బహిరంగ వేలం పాటల నిర్వహించారు. తలనీలాలు, కొబ్బరికాయల వ్యాపారం కోసం బహిరంగ వేలంలో సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. లడ్డూ, పులిహోర అమ్మకం హక్కును నెమ్మికల్ గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీను రూ.5.42 లక్షలకు దక్కించుకున్నారు. గతంలో రూ.1.71 లక్షలకు పాడగా ఈసారి రూ.3.71 లక్షలు అధికంగా పాడారు. పూజా సామగ్రి అమ్మకం హక్కును నెమ్మికల్ గ్రామానికి చెందిన అబ్బోజు మహేష్ రూ.8 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నిఖిత, ఆలయ ఈఓ కుశలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలి

అర్వపల్లి : విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక మొక్క చొప్పున నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎం. విజయలక్ష్మి కోరారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సింధూ అనే విద్యార్థిని పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం పాఠశాలలో మొక్కలు నాటారు. పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీదేవి, విమల, శ్రీరాములు, రమేష్, నాగయ్య, ప్రసన్న, స్వర్ణలత, అంజలి, సునంద, పీడీ పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబరాలు



బాణసంచా కాలుస్తున్న నాయకులు

తుంగతుర్తి : బీఆర్ఎస్ చేసిన పోరాటంతోనే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెరగలేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతయ్య అన్నారు. మంగళవారం కేటీఆర్ పిలుపుమేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు బాణసంచాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంగోతు నరేష్, గోపగాని శ్రీనివాస్, ఉప్పుల నాగమల్లు, బొంకూరి మల్లేష్, సాయికిరణ్, వెంకటేష్, రమేష్, మనోజ్, కిరణ్ పాల్గొన్నారు.

పత్తి రైతుల పరేషాన్!



ఫణిగిరిలో సాగు చేసిన పత్తిచేను



పస్తాలలో తెగుళ్లు సోకిన పత్తి చేను

- తెగుళ్ల బారిన పడుతున్న తెల్ల బంగారం
- వేధిస్తున్న కూలీల కొరత
- ప్రారంభం కాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు

నాగారం : ఈ ఏడాది పత్తి రైతులకు కాలం కలిసి రావడం లేదు. పత్తి పంట సాగు మొదలుకుని పత్తి తీసి విక్రయించే వరకు అష్టకష్టాలు తప్పడం లేదు. చివరికి కనీస మద్దతు ధర లభించకపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగారం మండల వ్యాప్తంగా ఈ ఏడాది 6,700 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా తెల్ల బంగారానికి ఎర్ర తెగుళ్లు ఆశిస్తున్నాయి. చివరికి చేతికందిన పత్తిని తీయాలన్నా కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

పెట్టుబడి రావడం కూడా కష్టమే..

పత్తి చేతికొచ్చే సమయంలో వరుసగా వర్షాలు కురవడంతో తెగుళ్లు సోకి పత్తి కాయలు నల్లబారి రాలిపోతున్నాయి. దీంతో దిగుబడి సగానికి పైగా పడిపోయింది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాలు దిగుబడి రావాల్సిన పత్తి ఈ ఏడాది ఎకరాకు 6 నుంచి 7 క్వింటాల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కూలి రేట్లు సైతం పెరిగాయి.

ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు..

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటకు గిట్టుబాటు ధర అందక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం పొడువు గింజ పత్తి క్వింటాకు రూ.7,521, మధ్యస్థ గింజ పత్తికి క్వింటాకు రూ.7,121 మద్దతు ధరలను ప్రకటించింది. కానీ పత్తి ఏరడం ప్రారంభమైనా నేటికీ పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులదే ఇష్టారాజ్యంగా మారింది. ఇప్పటికే అధిక వర్షాలు పడడం, పంటకు తెగుళ్లు సోకడం వంటి కారణాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చివరికి చేతికందిన పత్తినైనా గిట్టుబాటు ధరకు అమ్ముకుందామంటే ఇంకా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాలేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకే పత్తిని విక్రయించాల్సి వస్తోంది. దళారులు రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని పత్తిని క్వింటాకు రూ.6,000 నుంచి రూ.6,500లకు మాత్రమే కొనుగోలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



పత్తి పంటకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గిపోయింది. ఈ ఏడాది 5 ఎకరాల్లో పత్తిపంటను సాగుచేశాను. పత్తి ఏరుద్దామంటే కూలీల కొరత ఉంది. ఏరిన పత్తిని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుందామన్నా ఇప్పటివరకు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. దీంతో దళారులకు పత్తిని అమ్ముకునే పరిస్థితి వచ్చింది. అధికారులు వెంటనే సీసీఐ కేంద్రాలను ప్రారంభించి పత్తి రైతులను ఆదుకోవాలి.

– బి.సతీష్, రైతు, పస్తాల

టీఎమ్మార్పీఎస్ మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : నవంబర్ 6న టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాషపంగు సత్యం మాదిగ, జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్దాస్ శంకర్ మాదిగ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ ఆదేశాల మేరకు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిరసనోళ్ల బాలరాజు మాదిగ నాయకత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ రవి మాదిగ, నకిరేకంటి రాంబాబు మాదిగ, నకిరేకంటి వెంకన్న మాదిగ, ఈదుల పాండు, పిడమర్తి రవి, వల్దాసు సువార్త, గంగారపు దుర్గమ్మ, వల్దాసు ముత్తమ్మ, నేరెళ్ల జానకమ్మ, బోడ స్రవంతి పాల్గొన్నారు.

అనుమతించిన ప్రాంతాల్లోనే విక్రయించాలి

సూర్యాపేట : జిల్లా కేంద్రంలో అధికారులు అనుమతించిన ప్రదేశంలో మాత్రమే టపాసులు విక్రయించాలని ఆర్డీఓ వేణుమాధవరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టపాసుల విక్రయాల ధరలలో వ్యత్యాసాలు ఉన్నా, పట్టణంలో అనధికారికంగా టపాసుల విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసినా, నిబంధనలు అతిక్రమించినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా ఫైర్, మున్సిపాలిటీ, పోలీస్ వారి అనుమతి తీసుకోవాలన్నారు.

దుకాణాలన్నీ ఒకే చోట..

జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలోనే వ్యాపారులం అందరం కలిసి టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసి టపాసులు విక్రయిస్తామని వ్యాపారులు బోనగిరి రవికుమార్, యామా రవికిరణ్ అన్నారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుకాణదారులు పాలవరపు నర్సింహారావు, గుండా వెంకన్న, పీవీఆర్ బేకరీ, స్వాతి పేపర్ మార్ట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ



నాగారంలో మాట్లాడుతున్న తహసీల్దార్

నాగారం : మండల కేంద్రంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వి.బ్రహ్మయ్య మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని, కాంటా అయిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీలలో మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణకాంత్, ఏపీఎం శోభారాణి, ఏఈఓలు సాయిరాజ్, శ్రీను, సీసీ రామయ్య, ఐకేపీ నిర్వాహకులు, ట్యాబ్ ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో..

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

పెన్‌పహాడ్ : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ లాలునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంటాలు వేసిన వెంటనే ధాన్యం దిగుమతి అయ్యే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అజయ్‌నాయక్, ఏఈఓలు సంధ్య, మురళి, రాకేష్, ఇన్‌చార్జ్ సీసీ ఆశ, స్వరూప, ధనలక్ష్మి, విజయ, అన్నమేరి, శైలజ, ఇందిరమ్మ, సుశీల, చంద్రకళ, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్ డిపో ఏర్పాటు చేయాలని వినతి



సూర్యాపేటలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్ డిపో సాధన సమితి సభ్యులు

తిరుమలగిరి : తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయాలని బస్ డిపో సాధన సమితి కమిటీ సభ్యులు మంగళవారం మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటు చేయడం వల్ల నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని అన్నారు. డిపో ఏర్పాటు చేయకపోతే నవంబర్ 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రిలే దీక్షలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సాధన కమిటీ కన్వీనర్ కడెం లింగయ్య, ఎస్‌కే.పాషా, తెల్సూల లింగయ్య, కొండా సోమయ్య, చిలుకల రమేష్, కుమార్, వెంకన్న, కట్కూరి ఉపేందర్, మల్లేష్, కొమురయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సూర్యాపేటటౌన్ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఫీజు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు విద్యార్థులు, పలు కళాశాలల యాజమాన్యాలు, లెక్చరర్లు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల నుంచి విద్యార్థులకు అందజేయాల్సిన ఉపకార వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతోందన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. విద్యార్థులను, విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బానోత్ వినోద్‌కుమార్, అక్కినపల్లి వినయ్, తాళ్ల వినయ్, పులుసు శ్రవణ్, సంతోష్, మీరజ్ మనోహర్ శివ. గోపి గణేశ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన



వర్ధమానుకోటలో ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్న మండల ఆయుష్ వైద్యాధికారి

నాగారం : ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ విజయేందర్ అన్నారు. మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం, ధన్వంతరి జయంతిని పురస్కరించుకొని వర్ధమానుకోటలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పురాతన కాలం నుంచే ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉందని, ప్రజలు ఆయుర్వేద వైద్యసేలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రణవి, ఆయూష్ సిబ్బంది, గ్రామ కార్యదర్శి అంబేద్కర్, కారోబార్ శ్రీనివాసచారి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : అడ్డగూడూరు మండలం డి.రేపాక గ్రామంలో జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం రాజకీయ సంఘం జిల్లా చైర్మన్ తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓరుగంటి శ్రీనివాస్, ఈగ నాగన్న, వెంకన్న, తల్లాడ సూర్యకళ, తోట సులోచన, ఈగ కవిత, బండారు దయాకర్, వినయ్, బండారు నాగన్న, కేదారి, తల్లాడ శ్రీను, తల్లాడ భిక్షం, తల్లాడ శ్రీహరి, సత్యనారాయణ, రాజు, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం–సంగెం రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు



తిమ్మాపురం స్టేజీ వద్ద శిలాఫలకం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఆర్ అధికారులు

అర్వపల్లి : మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే తిమ్మాపురం–సంగెం రహదారి విస్తరణకు శంకుస్థాపన కార్యక్రమం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ శంకుస్థాపనకు మంత్రులను తీసుకురావడానికి ఎమ్మెల్యే మందుల సామేల్ ప్రయత్నిస్తున్నారు. పీఆర్ ఈఈ మాధవి, డీఈ బాబూరావు, ఏఈ కుమారస్వాములు మంగళవారం తిమ్మాపురం స్టేజీ వద్ద శిలాఫలకం గద్దె నిర్మాణ పనులను పరిశీలించారు. తిమ్మాపురం నుంచి సంగెం మీదుగా నూతనకల్ వరకు సుమారు రూ.32కోట్లతో 22కి.మీ రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నారు. త్వరలో శంకుస్థాపన తేదీని నిర్ణయించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, గోలి కోటిరెడ్డి, గుడిపల్లి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పాలెల్లి సురేష్, జీడి వీరస్వామి, గుడిపల్లి వెంకట్‌రెడ్డి, చిన్నతిరుమల్‌రావు, కరుణాకర్‌రెడ్డి, మల్లయ్య, నల్లగుంట్ల నాగేందర్, బింగి బాలరాజు, సిద్ధి రాము, గణేష్‌రెడ్డి, ఉమేష్, శంకర్, ఉజిత్, మహేష్, దినేష్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో ఎస్సీ హాస్టల్‌కు వెళ్లే రహదారి బురదమయంగా ఉందని, ఆ రోడ్డును వెంటనే మరమ్మతు చేయించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్, ఎంపీడీఓలకు తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా మదర్స్ కమిటీ అధ్యక్షురాలు పులి వినోద మాట్లాడారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్‌కి వెళ్లే దారి వర్షాలు వస్తే అధ్వానంగా మారుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సాకని వైష్ణవి, కాటూరి పూజ, స్పందన, భయ్యా సంధ్య, భావన, సరిత, మాధవి, శ్రీజ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు తోట జ్యోతి, పర్వతం నాగమణి, ఎంవీ.ఫౌండేషన్ ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, నాయిని సైదులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతికి సంతాపం

పెన్‌పహాడ్: మండల పరిధిలోని చెట్లముకుందాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంజనపల్లి ముత్తయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం అతడి మృతదేహానికి మాజీ సర్పంచ్ మిర్యాల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, రా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండమీది గోవిందరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మిర్యాల సతీష్, సైదులు, కట్టెల జార్జి, వెంకటేశ్వర్లు, గడ్డం వెంకన్న, బెల్లంకొండ వెంకన్న, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



సూర్యాపేట : బాలెంలలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న సాయిరెడ్డి

సూర్యాపేట : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం సూర్యాపేటలోని గురుకుల పాఠశాల, బాలెంల, ఎర్కారం, సోలిపేట గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఓటు హక్కు దరఖాస్తులకు నవంబర్ 6వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయవాదులకు మద్దతు ఇవ్వాలి

అర్వపల్లి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు జాతీయవాదులకు మద్దతు ఇవ్వాలని ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం, అర్వపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. వచ్చే నెల 6వరకు అర్హులైన ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



నాగారం : వర్ధమానుకోటలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు



నూతనకల్ : మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీమాతా ఫ్రెండ్స్ యూత్ సభ్యులు

నాగారం : నాగారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన సింగారం సాగర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా 2010–11 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మృతుడి స్నేహితులు మంగళవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ. 30,000 ఆర్థికసాయం అందజేశారు.

నూతనకల్ : మండల కేంద్రానికి చెందిన జూలూరి వెంకటాచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం మృతుడి కుమారుడి స్నేహితులు శ్రీమాతా ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. క్వింటా బియ్యంతోపాటు రూ. 14వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మారగాని రమేష్, బొడ్డుపల్లి ఉదయ్, కామని కిరణ్‌కుమార్, గడ్డం మహేష్, మారగాని మహేష్, బత్తిని మనోజ్, కనకటి ప్రవీణ్, గొడుగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ చివ్వెంల మండల అధ్యక్షుడిగా సాహెబ్ అలీ

చివ్వెంల : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడిగా ఎండీ సాహెబ్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం మండల కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.రామక్రిష్ణ, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, కె.అరుణ, కార్యదర్శులుగా సైదా నాయక్, జాని షరీఫ్, వెంకట రమణాచారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా నాయకుడు పబ్బతి వెంకటేశ్వర్లు వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీహెచ్ వెంకటేశ్వర్లు, రమణ, క్రాంతి కుమార్, ఏవీఆర్ శాస్త్రీ, రమాదేవి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నాగారం: కోతుల దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నాగారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి సోమయ్య ఇంట్లోకి మంగళవారం కోతుల మంద చొరబడగా వాటిని వెళ్లగొట్టే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కోతుల మంద ఒక్కసారిగా సోమయ్యపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. సోమయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి కోతుల మందును తరిమేశారు. సోమయ్య రెండు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన వృద్ధురాలు నూక నర్సమ్మపై, చలమందు, ముత్తమ్మ దంపతులపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నకు సన్మానం



చెవిటి వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

మద్దిరాల : రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌ను పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ మంగళవారం గుమ్మడవెల్లిలో కార్యకర్తలతో కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల భిక్షపతి గౌడ్, వల్లపు శ్రీనివాస్ యాదవ్, మద్దెల నరేష్‌గౌడ్, కూజ ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : తెలంగాణ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడిగా నియమితులైన డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌ను మంగళవారం కోమటిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు గుమ్మడవెల్లిలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో కోమటిపల్లి మాజీ సర్పంచ్ జాల నర్సయ్య గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మాండ్ర లింగయ్య, జాల మల్లయ్య, జాల అవిలయ్య, వల్లపు శ్రీను, మాండ్ర సూర్యం, జాల నరేష్, సందీప్ తదితరులు ఉన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు గుడిపాటి సైదులు, వైస్ చైర్‌పర్సన్ మోడెం శ్రీలత, సీఈఓ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు భిక్షంరెడ్డి, మజీద్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి బహూకరణ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు మంగళవారం జాతీయ వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు, పోలీస్ కానిస్టేబుల్ వై.ప్రవీణ్‌కుమార్ సుమారు రూ.10 వేల విలువ చేసే క్రీడాసామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. ఈ క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీదేవి, విమల, స్వర్ణలత, ప్రసన్నకుమారి, రమేష్, జటంగి నాగయ్య, అంజలి, శ్రీరాములు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎంకు క్రీడాసామగ్రిని అందజేస్తున్న దాత

పాఠశాలలో దీపావళి వేడుకలు



టపాసులు కాలుస్తున్న విద్యార్థులు

తుంగతుర్తి : వెంపటి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు ముందస్తుగా దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో ఉ పాధ్యాయులు పాలకుర్తి ఎల్లయ్య, మల్లెపాక రవీందర్, జీడి అనిల్‌కుమార్, గట్టు మాధవి, నవీన, బండారు భవాని, విక్రం, రమాదేవి, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.